క్లుప్తంగా

మహానందిలో భక్తుల సందడి



మహానంది కోనేరులో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



స్పోర్ట్ కిట్లను అందజేస్తున్న డాక్టర్ సింగపూర్ నాగేశ్వరరావు

పాములపాడు: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని డాక్టర్ సింగపూర్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని వేంపెంట గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లు, క్యారమ్ బోర్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడల్లో నైపుణ్యం సాధించి రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు సత్యరాజు, రాజేష్, వినయ్, యువరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

దేవీ మహత్యంపై ప్రవచనం



ప్రవచనం వినిపిస్తున్న ప్రవాచకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై తెనాలికి చెందిన నోరి నారాయణమూర్తి దేవీమహత్యంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించండి



మాట్లాడుతున్న ఏఓ స్వాతి

బండి ఆత్మకూరు : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, లేకపోతే భూమి నిస్సారంగా మారుతుందని కేవీకే శాస్త్రవేత్త రవి గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని ఈర్నపాడు, కడమలకాలువ గ్రామాల్లో వికసిత్ భారత సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. భూ సార పరీక్షల ద్వారా భూమి సారవంతాన్ని తెలుసుకోవాలని, వేసవి దుక్కులు వాటి ఆవశ్యకతను వివరించారు. విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఏఓ ఎం. స్వాతి, ఆత్మకూరు బీటీఎం ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం



బుద్ధానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పాములపాడు: మండలంలోని మిట్టకందాల, బుద్ధానగర్ గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రంథాలు శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని, అందులోని విషయాలను గ్రహించి నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీల సభ్యులు కుమార్ ఆచారి, పుల్లారెడ్డి, నాగమద్దిలేటి, భాస్కర్, చక్రపాణి, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం

- నియోజకవర్గంలో 49,767 హెక్టార్లలో సాగు
- 16,725 మంది రైతులు సాగుకు సిద్ధం
- సహకారం అందించని ప్రభుత్వం
- పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి



పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతన్న



ట్రాక్టర్‌తో గొర్రు తోలుతున్న దృశ్యం

నందికొట్కూరు: గతేడాది జరిగిన నష్టాలను పూడ్చుకోవాలనే కొత్త ఆశలతో ఈ ఏడాది ఖరీఫ్‌కు రైతన్న సిద్ధమవుతున్నారు. గతేడాది ఖరీఫ్, రబీల్లో ఆశించిన స్థాయిలో సకాలంలో వర్షాలు కురవపోవడంతో వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని భారీ నష్టాలతో పెట్టుబడులు రాక రైతులు చితికిపోయారు. నందికొట్కూరు నియోజకవర్గంలో గత వారంలో కురిసిన వర్షానికి ఆశలతో రైతులు ఖరీఫ్ సాగుకు సమయాత్తమవుతున్నారు. అయితే ప్రభుత్వంను సహకారం కరువవ్వడంతో ఇబ్బందులు పడుతున్నారు.

49,767 హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో అధికారుల లెక్కల ప్రకారం 49,767 హెక్టార్లలో పంట సాగు చేసేందుకు 16,725 మంది రైతులు సిద్ధమవుతునట్లు తెలిపారు. అధికారుల లెక్కల ప్రకారం వరి-12, 045 హెక్టార్లకు, కందులు-405 మినుములు-1194 హెక్టార్లలో, మొక్కజొన్న-14,768 హెక్టార్లలో రైతులు సాగు చేయనున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు అన్నదాత సఖీభవ కింద పెట్టుబడి సాయంతో పాటు సబ్సిడీ విత్తనాలు సైతం ఇవ్వకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగు ముందే పెట్టుబడి సాయం, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసేవారని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తోందని, వ్యవసాయం అంటేనే భయపడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులే మిగిలాయి..

గతేడాది తెగుళ్లతో పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి రాక చేసిన అప్పులే తీర్చలేకుంటున్నామని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాదైన అదృష్టాన్ని పరిక్షించుకుందామంటే సన్న, చిన్న కారు రైతులకు పెట్టుబడులకు డబ్బు అందక ఇబ్బందుల్లో ఉన్నామని, ప్రభుత్వం స్పందించి ఉచితంగా వితనాలు, ఎరువులు ఇచ్చి రైతన్న ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఇస్తే రైతులకు అందిస్తాం

ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా పంపిణీ చేస్తాం. ప్రభుత్వం ఉచితంగా ఇస్తే రైతులకు వితనాలు, ఎరువులు ఇస్తాం. అని రకాల వితనాలపై ప్రభుత్వం అందించిన సబ్సిడీ ప్రకారం పంపిణీ చేస్తాం. ఉచితంగా ఇవ్వమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఆదే విధంగానే ఇవ్వడం జరుగుతుంది.

– విజయశేఖర్ ఏడీఏ, నందికొట్కూరు

ఆత్మకూరులో..

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో మృగశిర కార్తె పర్వదినాన్ని ఆదివారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురవడంతో పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో ఆత్మకూరు డివిజన్‌లో దాదాపు 15 వేల హెక్టార్లలో రైతులు వివిధ పంటలను సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న, పత్తి, మెట్టవరి, వాణిజ్య పంటలైనా మిర్చి, పొగాకు పంటలు సాగు చేస్తారు.

విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలి



అప్పుల ఊబిలో కూరకపోయిన సన్న, చిన్న కారు రైతులకు విత్తనాలు ఉచితంగా ఇచ్చి ఆదుకోవాలి. గతేడాది వర్షాలు సకాలంలో కురువక వేసిన పంటలు ఎండిపోయి అప్పుల ఊబిలో కూరకపోయాం. అకాల వర్షాలకు భారీగా పంటలకు తెగుళ్ల సోకి పంట చేతికి వచ్చే సమయంలో నాశనమై దిగుబడి రాలేదు. ఈ ఏడాదైనా పంటలు పండుతాయని ఆశతో విత్తనం వేస్తున్నాం.

– ప్రభాకర్ లింగాల గ్రామం, పాములపాడు

ప్రభుత్వం ఆదుకోవాలి



తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతుంది. ఆచరణలో మాత్రం శూన్యం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఉచితంగా విత్తనాలు, ఎరువులు సరాఫరా చేయాలి. పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– నాగభూషణంరెడ్డి, 10 బొల్లవరం గ్రామం, నందికొట్కూరు మండలం

రుద్రవరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన కాశీ ముక్కంటి ఈశ్వర దేవాలయం

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కాశీ ముక్కంటి ఈశ్వర స్వామి దేవాలయ విగ్రహ, ధ్వజ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్‌నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ నెల 10న ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, 11 న ఉదయం భక్తులు బందెలతో స్వామి వారికి నీళ్ల పోసే కార్యక్రమం, సాయంత్రం పూజలు ఉంటాయన్నారు. 12న ప్రభాత పూజ, ప్రతిష్ఠాంగహోమాదులు, తదుపరి యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మూలా నక్షత్రయుక్త మిధున లగ్న శుభపుష్కరాంశములో యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్టాపన, శివ పార్వతుల కళ్యాణము తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మండలంలోని రుద్రవరం గ్రామంలో కాశీముక్కంటి ఈశ్వరస్వామి దేవాలయల విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ (పురుషులు) పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ్, శివ ఆదివారం తెలిపారు. ఈ నెల 10 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో విజేతలకు వరుసగా ఐదు స్థానాల్లో..రూ.15,000, రూ. 10,000, రూ.5000, రూ.3,000, రూ. 2000ల చొప్పున నగదు అందజేస్తాన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన జట్టు 9వతేదీ లోపు రూ. 300 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 96428 82600 నెంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: పట్టణంలోని 24 వార్డుల్లో దోమల బెడద అధికమైందని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గుండ్లకమ్మ, పీతెరివాగులో చెత్తా చెదారం నిలిచి వర్షపునీరు నిల్వ ఉండటంతో దోమలు అధికమయ్యాయన్నారు. ఇప్పటికే పట్టణంలో విష జ్వరాలు పెరిగాయని, దోమలు వ్యాపించకుండా సత్వరమే ఫాగింగ్ చేపట్టాలన్నారు. మున్సిపల్ అధికారులు దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలన్నారు. సురేంద్ర, ఈరన్న పాల్గొన్నారు.



పొలంలోనే వరిగడ్డిని కాల్చి వేసిన దృశ్యం (ఫైల్)

పర్యా'హరణం'

- కోత అనంతరం పొలంలోనే వరి గడ్డిని కాల్చుతున్న రైతులు
- పుడమికి, వాతావరణానికి నష్టం అంటున్న నిపుణులు
- ఖాతరు చేయని కర్షకులు



బండి ఆత్మకూరు సమీపంలో పొలంలోనే వరి దుబ్బలను తగలబెట్టిన దృశ్యం (ఫైల్)

బండిఆత్మకూరు: పంట కోతలు పూర్తయ్యాక వరి గడ్డిని కాల్చడానికే రైతులు మొగ్గుచూపుతున్నారు. భూమికి నష్టం కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నా తాత్కాలిక ప్రయోజనాలకే వారు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో వందలాది ఎకరాల్లో వరి గడ్డిని కాల్చి బూడిద చేస్తున్నారు. తద్వారా భూసారానికి, పర్యావరణానికి కూడా ముప్పు వాటిల్లుతోంది. అత్యధిక శాతం మంది రైతులకు దీనిపై పూర్తి స్థాయి అవగాహన లేక పోవడంతో ఈ తంతు ప్రతి పంటకాలం పూర్తయ్యాక కొనసాగుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక ప్రయోజనం..

ప్రస్తుతం వ్యవసాయ భూములను సాగు చేస్తున్న వారిలో కౌలుదారులే అత్యధికం. దీంతో తాము సాగు కోసం తీసుకున్న భూమిలో పంటను తీసుకునేందుకు మాత్రమే రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. దీర్ఘకాలంగా భూమి ఆరోగ్యం, పర్యావరణానికి జరిగే నష్టాలను గురించి ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎకరా భూమిలో ఎండుగడ్డిని సేకరించి, మేటుగా వేయడానికి దాదాపు రూ.6 వేల నుంచి రూ.8 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

తగ్గిన పశుసంపద..

పాడిపై ఆధారపడే రైతులు కూడా తగ్గిపోవడంతో ఎండుగడ్డి ప్రాధాన్యం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో సాగుకు సిద్ధం చేసుకునే కార్యక్రమాల్లో భాగంగా ఎండుగడ్డిని కాల్చివేస్తున్నారు. నియోజకవర్గంలో ఆత్మకూరు, మహానంది, వెలుగోడు, బండిఆత్మకూరు మండలాల్లో దాదాపు 24 వేల హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. ఇందులో 30 శాతం లోపు మాత్రమే ఎండుగడ్డిని సేకరించినట్లు అంచనా. మిగిలినదంతా పొలాల్లోనే తగలబెడుతున్నారు. సంప్రదాయబద్ధంగా గడ్డిని కుళ్లబెట్టేందుకు కూడా సమయం ఎక్కువ తీసుకుంటోందని అన్నదాతలు చెబుతున్నారు. వరి రకం, విపరీతమైన పురుగు మందుల వినియోగం, యంత్రాలతో కోతల కారణంగా వరి దుబ్బులు తొందరగా కుళ్లడం లేదని వాపోతున్నారు. వేసవి దుక్కులు, రెండు సార్లు దమ్ము చేయడం ద్వారా ఎంత కఠినమైన వరి దుబ్బు అయినా నేలలో కలిసి కుళ్లుతుందని, అతి తక్కువ మంది మాత్రమే వేసవి దుక్కులను చేస్తున్నారని ఆయా గ్రామాల్లోని సీనియర్ రైతులు తెలియజేస్తున్నారు. వరి గడ్డిని ఏటేటా కాల్చడం కారణంగా క్రమంగా పంట దిగుబడిపై ప్రభావం తప్పదని వారు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ సాగు విధానంలో వచ్చిన మార్పులు, కౌలుదారీ విధానం, ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే వరి గడ్డిని కాల్చడమే సులువైన పనిగా రైతులు భావిస్తున్నారని పేర్కొంటున్నారు.

పశువులు లేకపోవడంతోనే..



గతంలో వ్యవసాయంతో పాటే పశువుల పెంపకం కూడా ఉండేది. అప్పుడు ఎండుగడ్డికి ప్రాధాన్యం ఇచ్చేవారు. పాడి పశువులను పెంచడం భారీగా తగ్గిపోవడంతో ఇప్పుడు ఎండుగడ్డి అవసరం తగ్గింది. నిప్పు పెడితే సులభంగా చేనును శుభ్రం చేయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ఉన్నారు. నష్టాలను గురించి ఆలోచించడం లేదు.

– హుసేన్‌బాషా, రైతు, జీసీ పాలెం

అవగాహన పెంచాలి



రైతులు సాగు చేసే భూముల్లో వరి గడ్డిని తగలబెట్టకుండా అవగాహన కల్పించాలి. దీర్ఘకాలంలో పంట దిగుబడి తగ్గిపోతుందని తెలియకే రైతులు ఇలా చేస్తున్నారు. కాల్చడం వల్ల కలిగే నష్టాలను సాగుకు ముందే వివరించడం మేలు. ముఖ్యంగా రైతులకు పశుపోషణ చేపట్టేలా చూడాలి.

– బాలిరెడ్డి, రైతు, లింగాపురం

పదిమంది ఎస్జీటీలకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

జూపాడుబంగ్లా: పదిమంది సెకండ్ గ్రేడ్ టీచర్లకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం లుగా పదోన్నతి లభించినట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి ఆదివారం తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో సెకండ్ గ్రేడ్ టీచర్లుగా విధులు నిర్వహిస్తున్న టీచర్లకు పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించి ఇతర పాఠశాలలకు బదిలీచేసినట్లు వెల్లడించారు. అలాగే మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 15 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయినట్లు తెలిపారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కావాలని ఆదేశించారు.

అన్ని శాఖల ఉద్యోగులు హాజరుకావాలి

పాములపాడు: మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు సోమవారం నిర్వహించే యోగాంధ్ర ర్యాలీకి హాజరుకావాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. యోగా పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది, కాలేజీ విద్యార్థులు ఉదయం 10గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

నందికొట్కూరు: సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన అమలు చేయడం తగదన్నారు. హామీల అమలు కోసం సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమం ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగార్జున, గాబ్రేల్, బీబీ, లక్ష్మిదేవి, రామకృష్ణ, సుధాకర్, బజార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శనగల బసవన్నకు విశేష పూజలు



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజుల్లో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. ఆదివారం 17మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి పూజను జరిపించుకున్నారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకలం పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తదనంతరం నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలు, మల్లికాగుండంలోని శుద్ధ జలంతో అభిషేకం జరిపించారు. చివరగా.. నూతన వస్త్రసమర్పణ, విశేషార్చన, నానపెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

మహానందిలో పోలీసుల తనిఖీలు



మహానంది టోల్‌గేట్ వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

మహానంది: దేవస్థానం పరిధిలోని గాజులపల్లె వైపు, నంద్యాల వైపు ఉన్న టోల్‌గేట్ల వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బక్రీద్ పర్వదినం అనంతరం మరుసటి రోజైన ఆదివారం తనిఖీల్లో భాగంగా మద్యం, మాంసంతో పాటు మత్తు పదార్థాలు ఆలయ ప్రాంగణంలోకి రాకుండా పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐ మౌలాలి, పోలీసు సిబ్బంది కిషోర్‌కుమార్, చంద్రశేఖర్ తనిఖీల్లో పాల్గొన్నారు. కాగా..ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రోడ్ల వెంట చెట్లు పడిపోగా కానిస్టేబుళ్ల చంద్రశేఖర్, శేషన్న ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో చెట్లను రోడ్డుకు అడ్డుగా లేకుండా తొలగించి సహాయ చర్యలు చేపట్టారు.

ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

జూపాడుబంగ్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన జుర్రుహారిక(585), బర్రుహేమచంద్రారెడ్డి(546), గురుకుల పాఠశాలకు చెందిన కొమ్మురి రవితేజ(506), తోళ్లరెడ్డిపోగు జగదీష్(547), మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బోయ కల్పన(577), జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలకు చెందిన సయ్యద్ సుమయ్య(500) విద్యార్థులు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నేడు జిల్లా కేంద్రమైన నంద్యాలలోని ఏఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే వేడుకల్లో కలెక్టర్ రాజకుమారి గణియా పుస్కారాలు అందజేస్తామన్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరవ్వాలని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు.

ఈఏపీసెట్‌లో 851 ర్యాంకు



పోచా ధన్విక

జూపాడుబంగ్లా: ఆదివారం సాయంత్రం వెలువడిన ఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన పోచాశ్యాష్టారెడ్డి కుమార్తె పోచా ధన్విక రాష్ట్రస్థాయి 851 ర్యాంకు సాధించింది. విజయవాడలోని చైతన్య కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన ధన్విక ఇంటర్‌లో 991 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. భవిష్యత్తులో ఐఏఎస్ సాధించటమే తన లక్ష్యమని ధన్విక తెలిపింది. ధన్విక తల్లి ఎల్.వెంకటేశ్వరమ్మ వైఎస్సార్ కడపజిల్లాల్లోని పులివెందుల విజయడెయిరీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండటంతో ప్రస్తుతం వారు అక్కడే నివాసం ఉంటున్నారు.



అబ్బీపురంలోని గిరిజన కాలనీలో చేరిన వర్షపు నీరు



పడిపోయిన స్తంభాలను పరిశీలిస్తున్న విద్యుత్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది

మహానందిలో వర్ష బీభత్సం

- దారి వెంట నేలకొరిగిన భారీ వృక్షాలు
- నిలిచిపోయిన వాహనాలు
- పడిపోయిన విద్యుత్ స్తంభాలు



బుక్కాపురం వద్ద నేలకొరిగిన వృక్షాలు



వేర్లతో సహా కూలి పడిన వృక్షం

మహానంది: మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. నంద్యాల నుంచి బుక్కాపురం వెళ్లే మార్గంలోని తమ్మడపల్లె ఇంజవాణి చెరువు సమీపంలో భారీ వృక్షాలు నేలకొరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో స్థానికులతో పాటు మహానంది ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డారు. బుక్కాపురం సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తమ్మడపల్లె దాటిన తర్వాత సూర్యనంది ముఖద్వారం వద్ద భారీ వృక్షాలు పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. బుక్కాపురం గ్రామానికి చెందిన గోగుల చిన్న నరసింహుడు ఇంటిపై పిడుగు పడిన ఘటనలో ప్రమాదం తప్పింది. అదే గ్రామానికి చెందిన కుంచపు వెంకటేశం ఇంటిపై పిడుగుపాటుకు సోలార్ దెబ్బతినడంతో పాటు పాక్షిక నష్టం చేకూరినట్లు చెప్పారు. తిమ్మాపురం, బుక్కాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలు పడిపోగా, చెట్లు కూటటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏఈ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపడుతున్నారు. అబ్బీపురంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉన్న చెంచుకాలనీలోకి నీళ్ల రావడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.